



తుంగభద్ర ఎగువ కాలువ (ఫైల్)

ఆధునీకరణ అటకెక్కినట్లేనా ?

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు అరకొర నిధులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాకు నికర జలాలను అందించే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ ఈసారి కూడా అటకెక్కినట్టు కనిపిస్తోంది. దీంతో దీని కిందనున్న గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, మిడ్ పెన్నార్ దక్షిణ కాలువల ఆధునీకరణ కూడా ఆగిపోయినట్లే అనిపిస్తోంది. హంద్రీనీవాకు కొంత వరకు నిధులు కేటాయించినప్పటికీ తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ రెండు దశలకు కలిపి రూ.70 కోట్ల వరకే ఇచ్చారు. దీంతో అంతకు మునుపు నడుస్తున్న పనుల పురోగతి దాదాపు ఆగిపోయినట్టే కనిపిస్తోంది.

ఆధునీకరణ ఆగింది

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ అనంతపురం జిల్లా సరిహద్దు 105.437 కిలోమీటరు నుంచి 189.680 కిలోమీటరు వరకు ఆధునీకరించేందుకు గతంలో పనులు చేపట్టారు. రూ.458 కోట్లతో చేపట్టిన ఈ పనులు రూ.309 కోట్లు ఖర్చు పెట్టాక గత వైసిపి ప్రభుత్వం 2020లో ఈ పనులను రద్దు చేసింది.మరో ఐదేళ్ల ఈ పనులు చేపట్టేందుకు వీల్లేదని షరతు పెట్టింది. అయితే ఆ ఐదేళ్ల సమయం కూడా పూర్తయింది. దీంతో ఈ బడ్జెట్‌లో ఆధునీకరణను చేపడతారని జిల్లావాసులు ఆశించారు. కాని ఆ రకమైన కేటాయింపులు బడ్జెట్‌లో జరగలేదు. కేవలం మరమ్మతులకు గత బడ్జెట్‌లో పెట్టిన రూ.25 కోట్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఒకవైపు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. ఎప్పుడు ఎక్కడ గండ్లు పడతాయోనని నీటిని పొదుపుగా తీసుకోవాల్సి వస్తోంది. తుంగభద్ర డ్యామ్‌లో నీరు పొంగిపోర్లినా ఎగువ ప్రధాన కాలువకు ఎక్కువగా నీటిని తీసుకునే అవకాశం లేకుండా ఉంది.

ఆగిన గుంతకల్లు ఉప కాలువ ఆధునీకరణ

గుంతకల్లు ఉపకాలువ ఆధునీకరణ కూడా ఆగిపోయింది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నుంచి ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాలకు సాగునీటిని అందించే ఈ కాలువ ఆధునీకరణ మధ్యలోనే ఆగింది. 2015లో రూ.234 కోట్లతో చేపట్టారు. రూ.188 కోట్లు ఖర్చు పెట్టాక పనులు చేపట్టలేమని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఈ బడ్జెట్‌లో ఈ పనులకు కేటాయింపుల్లేనట్లుగానే కనిపిస్తోంది.

మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువది అదే పరిస్థితి

మిడ్‌పెన్నార్ రిజర్వాయరు నుంచి దక్షిణ కాలువ సున్నా కిలోమీటరు నుంచి 80 కిలోమీటర్ల మేర ఆధునకీకరణకు 2015 పనులు చేపట్టారు. రూ.509 కోట్లతో చేపట్టిన ఈ పనులను రూ.205 కోట్లు ఖర్చు పెట్టాక ఆపేశారు. ఇప్పుడు ఈ పనులను చేయలేమని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో ఇవి మధ్యలోనే ఆగిపోయాయి. అనంతపురం జిల్లాలో అందే అత్యధిక సాగునీటి వ్యవస్థల్లోనే ఈ మూడు కాలువలే ప్రధానం. ఈ మూడు కాలువల పనితీరు ఇలా అర్ధాంతరంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా వీటి ఆధునీకరణ పనులు మాత్రం సాగడం లేదు.

ఘోరం

పండంటి బిడ్డతో కుటుంబ సమేతంగా పుట్టింటి నుంచి మెట్టినింటికి ఆనందంగా వెలుతున్న ఓ కుటుంబాన్ని కారు రూపంలో మృత్యువు కబళించింది. కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళలు, ఆరు నెలల చిన్నారి మృతి చెందిన విషాదఘటన అనంతపురం జిల్లా కూడేరు మండలంలో చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్క చెల్లెళ్లు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాశక్తి -అనంతపురం క్రైం



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

ఘటనాస్థలంలో కారు

మృతిచెందిన చిన్నారి విద్యశ్రీ

కూడేరు వద్ద రోడ్డు ప్రమాదం ఆటోని ఢీకొన్న కారు నలుగురు మృతి



మృతులు సరస్వతి, యోగేశ్వరి, చిన్నారి విద్యశ్రీ (ఫైల్‌ఫొటోలు)

ఉరవకొండ మండలం రాయాపురం గ్రామానికి చెందిన సతీష్‌కు గార్లదిన్నె మండలం మార్తాడు గ్రామానికి చెందిన సరస్వతి అనే మహిళతో పదేళ్ల కిందట వివాహమైంది. మూడేళ్ల కిందట ఓ బాబు పుట్టగా ఆరు నెలల కిందట పండంటి ఆడబిడ్డకు సరస్వతి జన్మనిచ్చింది. ఆరు నెలల తర్వాత అత్తగారింటికి వెళ్లడానికి పుట్టింటి నుంచి సోమవారం వడిబియ్యం పోసుకుని తన ఇద్దరు అక్కలతో కలిసి ఆటోలో గార్లదిన్నె మండలం నుంచి బయలుదేరారు. కారు రూపంలో తమ జీవితాలను బలి తీసుకుంటుందని ఆడబిడ్డలకు తెలియలేదు. కూడేరు మండలం కమ్మూరు గ్రామ సమీపంలో స్కంద వెంచర్ వద్ద ఉరవకొండ నుంచి వేగంగా వస్తున్న కారు వీరి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో సరస్వతి (40) అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన ఆరునెలల చిన్నారి విద్యశ్రీ సరస్వతి సోదరిలు యోగేశ్వరి (45), నీలమ్మ (50) ఆసుపత్రిలో మృతిచెందారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన కారులో అనంతపురంలోని ఓ ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ముగ్గురు యువకులు ఇద్దరు యువతులు ఉన్నట్లు సమాచారం. పెన్నోబిలం నుంచి అనంతపురానికి వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టినట్లు తెలిసింది. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మహాసభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

సెంట్రల్ యూనివర్సిటీకి

కేంద్ర బడ్జెట్‌లో మొండిచేయి

'వర్శిటీ'లో ఫీజులను నియంత్రించాలి-మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రాష్ట్ర విభజన అనంతరం జిల్లాకు కేటాయించిన సెంట్రల్ యూనివర్శిటీకి ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో మొండిచేయి చూపడం బాధాకరమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ విమర్శించారు. ఆదివారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో సెంటర్ యూనివర్సిటీ 3వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన జరిగిన దాదాపు పదేళ్ల తర్వాత సెంట్రల్ యూనివర్సిటీ కొంత పూర్తిస్థాయిలో ప్రారంభించారన్నారు. అయితే ఇప్పటికీ యూనివర్సిటీలో పూర్తిస్థాయిలో తరగతి గదులు, హాస్టల్ భవనాలు లేకపోగా అమ్మాయిలకు రక్షణ కరువైందన్నారు. అంతేగాకుండా దేశంలోనే ఎక్కడా లేనివిధంగా అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై ఫీజులు భారం వేస్తున్నారన్నారు. అభివృద్ధికి చేయూతనందించాల్సిన కేంద్రం పూర్తిగా విస్మరించిందన్నారు. ఇందుకు ఇటీవల విడుదల చేసిన బడ్జెట్టే ఇందుకు నిదర్శమన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధి నిధుల సాధన కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం 21మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి మేరీ జార్జి, ఎస్ఎఫ్ఐ అనంతపురం జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షుడు సిద్ధు, ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల కన్వీనర్ రజిత, ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, సహాయ కార్యదర్శి భీమేష్, జిల్లా కమిటీ సభ్యులు సోము, సాయి, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ సీనియర్ నాయకులు జినీత్, వంశీ, తన్వై, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించాలి

యునైటెడ్ సిటిజన్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఎంవి. ఆంజనేయులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ వినియోగదారుల నుంచి వ్యక్తమవుతున్న ఇబ్బందులు ఫిర్యాదులు, సూచనలను విద్యుత్ నియంత్రణా మండలి కమిషన్ స్వీకరించి పరిష్కరించిన తర్వాతే విద్యుత్ సంస్కరణలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ సిటిజన్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఎంవి.ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడు ఎ.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో 'విద్యుత్ బిల్లులు పెంపుదల ప్రజలపై పడుతున్న భారాలు' అనే అంశంపై పాతూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియంత్రణ కమిషన్‌కు పదే పదే వ్యక్తమయ్యే ఫిర్యాదులు, సూచనలను ప్రభుత్వం పరిష్కరించే వరకు వివిధ రకాల ప్రజాస్వామ్య బద్ధంగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. సంక్షేమ రాజ్యం అన్ని చెప్పుకుంటూ ప్రభుత్వం విద్యుత్ అవసరాన్ని సరిగ్గా అంచనా వేయడంలో, విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను ప్రజల అవసరాలు తగిన విధంగా ఉత్పత్తి చేయడంలో విఫలమైన ఆ శాఖ నిర్లక్ష్యం పని తీరు వల్లే విద్యుత్ వినియోగదారులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రయివేట్ సంస్థలకు అనుకూలంగా ఉండేలా సంస్కరనలు రూపొందించినట్లు ఉందన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు లోపభూయిష్ట నిబంధనలకు విరుద్ధంగా అదనపు దార్జీలు వసూలు చేయడం చేస్తున్నారని తెలిపారు. ట్రూ ఆఫ్ చార్జీల గురించి ప్రజలకు తెలియదన్నారు. వినియోగించే విద్యుత్ కోసం వసూలు చేసే వాస్తవ బిల్లులకు ట్రూ ఆఫ్ చార్జీలు మించి పోతున్నాయని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా భారాలు మోపడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. సుమారు రూ.13,400 ఖరీదు చేసే స్మార్ట్ మీటర్‌లను బిగించే కార్యక్రమం డిస్కంలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించి ప్రయివేట్ సంస్థలకు ఎటువంటి పెట్టుబడి లేకుండా భారీ సంపదను సంపాదించడానికి మీటర్‌లు ఉపయోగపడేలా ఉన్నాయి తప్పా వినియోగదారులకు భారాలు మోపుతున్నారని తెలిపారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్న సమాయన్ని ఆధారంగా డైనమిక్ ధర నిర్ణయించడం అనేది వినియోగదారుల బహిరంగ దోపిడీకి గురిచేయడం విచారకరం అన్నారు. విద్యుత్ ఉత్పత్తి ఖర్చు సీజన్ ప్రకారం మారవచ్చని, వినియోగం గంట ప్రకారం కాకుండా అంతేకాకుండా డిస్కం కేంద్ర ప్రభుత్వల యొక్క ప్రతి ఆదేశాలను అంగీకరించాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ రంగంలోని విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల మొత్తం సామర్థ్యాన్ని ప్రభుత్వం ఉపయోగించుకోవాలన్నారు. విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని విభాగాల మొత్తం పని తీరుకు ప్రైవేట్ సంస్థల ప్రయోజనాల కంటే వినియోగదారుల ప్రయోజనాలపై దష్టి సారించి సమగ్ర పునరుద్ధరణ అవసరం అన్నారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో అదనపు దార్జీలను వసూలు చేసే వ్యవస్థను వెంటనే నిలిపివేయాలన్నారు. సేకరించిన మొత్తాలను వినియోగదారుల తదుపరి బిల్లులలో తదనుగుణంగా సర్దుబాటు చేయాలన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలలోని అసమాన నిబంధనలను తొలగించాలన్నారు. స్మార్ట్ మీటర్‌లను అందించడం వెంటనే నిలిపివేయాలన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వద్ద ఇంకా పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదిత సవరణల నేపథ్యంలో కేంద్ర విద్యుత్ చట్టం కింద నిబంధనలను మార్చే విధానం చట్టబద్ధంగా సరైంది కాదన్నారు. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ ఈ రంగంలో ప్రైవేట్ సంస్థలకు అనుకూలంగా నియమాలను మార్చకూడదన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ రసూల్, వైసిపి నాయకుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు దాదాగాంధీ, పట్టణ పౌరసంఘాల సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి ఎజి రాజమోహన్, ఉపాధ్యక్షులు ఎంఎస్‌టి.రాజు, సోమర రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనైటెడ్ సిటిజన్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఎంవి.ఆంజనేయులు

పెద్దవడుగూరులో

కనిపించని సులభ్ కాంప్లెక్స్

ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరు మండలం కేంద్రంలో సులబ్ కాంప్లెక్స్ లేకపోవడంతో మహిళలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు నానా ఇబ్బందులు పుడుతున్నారు. గతంలో ఉన్న సామూహిక మరుగుదొడ్లను కూల్చివేసిన ప్రభుత్వం వాటి స్థానంలో నిర్మించాల్సిన సులబ్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయలేదు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. పెద్దవడుగూరు మండలంలో 39 గ్రామాలు ఉన్నాయి. వారందరూ తహాశీల్దార్, ఎంపిడిఒ తదితర కార్యాలయాలకు వివిధ పనులపై నిత్యం మహిళలు మండల కేంద్రానికి వచ్చిపోతుంటారు. ముఖ్యంగా ఇటీవలి మహిళల అధిక సంఖ్యలో వస్తున్నారు. ఎందుకంటే ప్రభుత్వం, ఇంటి స్థలాలు, ఇండ్లు, రాయితీ రుణాలు వంటివి మహిళల పేర్లతో మంజూరు చేస్తుండగా ఏ సమస్య వచ్చినా మహిళలే అధికంగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ క్రమంలో అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు మల, మూత్ర విసర్జన ప్రధాన సమస్యగా మారింది. ప్రధాన కూడలి, రహదారుల్లో జనసంచారం అధికంగా ఉండడంతో మహిళలు ఇలాంటి అవసరాలు తీర్చుకోవాలంటే చాలా రకాలుగా ఇబ్బంది పడుతున్నారు. మహిళలు విధిలేక ఎక్కడో ఒకచోట చాటుగా కాలకృత్యాలు తీర్చుకునే పరిస్థితి రావడం బాధాకరం. లేకపోతే ఆయా ప్రాంతాల్లో నివాసం ఉండే మహిళలను అడిగి అవసరాలు తీర్చుకుంటున్నారు. వివిధ అవసరాల కోసం మండల కేంద్రాన్ని సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో మహిళలు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెద్దవడుగూరులో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని మండలవాసులు, మహిళలు కోరుతున్నారు.

ఇంగ్లాండ్ ప్రతినిధిని కలిసిన జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి -తాడిపత్రి రూరల్

ండలంలో పర్యటించిన ఇంగ్లాండ్ ప్రతినిధి ఫ్యాట్రిక్‌ను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా చుక్కలూరు వద్ద ఉన్న సిద్ధార్థ కోల్డ్ స్టోరేజ్ వద్దకు చేరుకుని తాడిపత్రి ప్రాంతంలో సాగు చేస్తున్న అరటి, తదితర పంటల విధానంపై వివరించారు. జిల్లా నుంచి పండ్ల ఉత్పత్తులను సేకరించి యూరప్ దేశాలకు ఎగుమతులు చేసేందుకు ప్రోత్సహించాలని ప్రభాకర్‌రెడ్డి కోరారు. అనంతరం ఆయనకు మొమెంటో అందజేసి సన్మానించారు.



ఇంగ్లాండ్ ప్రతినిధి ఫ్యాట్రిక్‌ను సన్మానిస్తున్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లక్షమందికి పైగా మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నామని తెలిపారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం ప్రారంభించనున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రయివేటు పాఠశాలల్లోనూ చదువుతున్న విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయనున్నామన్నారు. మహిళల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సగం హక్కు కల్పించారని, మహిళా యూనివర్శిటీని స్థాపించారని గుర్తు చేశారు. రాజ్యాధికారంలోనూ భాగస్వామ్యం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు అన్నింటా మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. మహిళల పేరునే ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తున్నారన్నారు.

విద్యార్థులందరికీ 'తల్లికి వందనం'

ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రయివేటు పాఠశాలల్లోనూ చదుకున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇంట్లో ఎంత మంది విద్యార్థులుంటే అందరికీ ఈ పథకం కింద ఏటా రూ.15 వేలు అందజేస్తామన్నారు. రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లక్ష మందికిపైగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. శిక్షణ అనంతరం కుట్టు మిషన్లు అందజేయబోతున్నామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని కూడా నెరవేర్చబోతున్నట్లు మంత్రి ప్రకటించారు.

పౌష్టికాహారం పంపిణీలో అంగన్వాడీలే కీలకం

జిల్లా మహిళా సాధికారత, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధా వరలక్ష్మి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

గర్భిణులతో పాటు బాలింతల, మహిళల ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరమని, ఇందులో అంగన్వాడీలదే కీలకపాత్ర అని జిల్లా మహిళా సాధికారిత, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధా వరలక్ష్మి తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 6 ఏళ్ల వరకు అంగన్వాడీ కేంద్రాల్లో తల్లి బిడ్డకు పౌష్టికాహారం అందించడం, గర్భిణులకు, బాలింతలకు తగు జాగ్రత్తలు తెలుపుతూ గ్రామాల్లో అంగన్వాడీలు, మినీ అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. ఇవి కాక ఓటు నమోదు కార్యక్రమాలు, పింఛన్లు పంపిణీ తదితర అదనపు పనులు అధికారుల ఆదేశాల మేరకు చేస్తుంటారు. ఇవి కాక అధికారుల పెత్తనం రాజకీయ నాయకుల ఒత్తిడులు తట్టుకొని తమ విధులు నిర్వర్తిస్తుంటారు. ఇంత చాకిరీ చేసినా వారికి కనీస వేతనాలు అమలు కావడం లేదు. రిటైర్డ్‌మెంట్ తరువాత ప్రభుత్వము నుంచి ఎలాంటి బెనిఫిట్స్ అందడం లేదు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు మేరకు కనీస వేతనం రూ. 26 వేలు, గ్రాడ్యుటీ, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలి. కానీ అవి అమలు కావడం లేదు. అంగనవాడీ వర్కర్లకు అయితే రూ.11వేలు, మినీ వర్కర్లు ఆయాలకు రూ.7వేలు మాత్రమే వేతనాలు అందుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇతర సౌకర్యాలు కల్పించాలని అంగన్వాడీ వర్కర్ల యూనియన్, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకై ఈనెల 10న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా మహిళా సాధికారిత, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధా వరలక్ష్మి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.



ప్రశ్న : జిల్లాలో ఎన్ని అంగన్వాడీలు ఉన్నాయి? వాటి వివరాలు తెలపండి.?

జవాబు : జిల్లాలో మొత్తం 2824 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 617 మినీ అంగనవాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలు 12 ప్రాజెక్టు కేంద్రాల పరిధిలో ఉన్నాయి. ప్రాజెక్టు కేంద్రాలు పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, బత్తలపల్లి, పెనుకొండ, సోమందేపల్లి, మడకశిర, హిందూపురం, గుడిబండ, నల్లచెరువు, ఒడిసి ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణలో అంగనవాడీ కేంద్రాలు పని చేస్తాయి. ప్రతి ప్రాజెక్టుకు సిడిపిఒ, సూపర్వైజర్లు ఉంటారు.

ప్ర: ఈ కేంద్రాల్లో ఎంతమంది అంగన్వాడీలు ఉంటారు? వారి విధులు ఏమిటి.?

జ : ప్రధాన అంగన్వాడీ వర్కర్లు 2187 మంది, మినీ వర్కర్లు 612 మంది, సహాయకులు (ఆయాలు) 2137 మంది ఉన్నారు. జిల్లాలో 6386 మంది గర్భిణులు ఉండగా 3614 మంది బాలింతలుఉన్నారు. 6 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలు 37606 మంది, 3 నుంచి 6 ఏళ్ల పిల్లలు 35161 మంది ఉన్నారు. పిల్లల వయస్సు బట్టి పాలు, గుడ్లు, భోజనం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ కేంద్రాల్లోని పిల్లలకు విద్యను అందించే విధంగా అంగన్వాడీలు చర్యలు తీసుకుంటారు. అదే 6 నెలల గర్భిణులు, బాలింతలకైతే సరుకులు 6 నెలల పాటు పంపిణీ చేయడం జరుగుతుంది. 3 నుంచి 6 ఏళ్ల పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి వస్తేనే వారికి పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుంది. ఇదంతా ఆయా ప్రాజెక్టు సిడిపిఒ, సూపర్వైజర్లు పర్యవేక్షిస్తుంటారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వారు సరిదిద్దుతారు.

ప్ర : అంగన్వాడీలు, మినీ అంగన్వాడీలు, సహాయకుల సమస్యలపై మీ చర్యలు ఏమిటి.?

జ: మా పరిధిలో వరకు ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం. వారు వేతనాలు పెంచాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యుటీ అమలు తదితర సమస్యలు మా పరిధిలో లేవు. వాటిపై ప్రభుత్వం విధాన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అంగనవాడీ యూనియన్ నాయకులు, ప్రజా సంఘాలు మా దృష్టికి తెచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదిస్తాం. మా పరిధిలో పరిష్కరించే సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకుంటాం.

ప్ర : అంగన్వాడీలకు, గర్భిణులకు, బాలింతలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి.?

జ : గర్భిణులు మొదటి నుంచి పౌష్టిక ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డతోపాటు ఆ మహిళలు ఆరోగ్యంగా ఉంటారు. గర్భిణిగా ఉన్న సమయంలో బరువులు ఎత్తడం, ఇంటి పనులు చేయడం లాటి వాటికి దూరంగా ఉండిఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలి. తరచూ ఆరోగ్య కార్యకర్తలు ఇచ్చే ఆరోగ్యపరమైన సలహాలు జాగ్రత్తలు పాటించాలి. బాలింతలు కూడా బిడ్డ సంరక్షణతో పాటు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. అవసరమైన మందులతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. అంగన్వాడీలకు సహకరించాలి. అంగన్వాడీలు కూడా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భణులకు, బాలింతలకు పసిపిల్లలకు సక్రమంగా అందించే విధంగా విధులు నిర్వర్తించాలి. వారికి సేవలందిస్తున్నామనే అంకితభావంతో పని చేసి మన్ననలు పొందాలి.



ఐసిడిఎస్ పీడీ సుధా వరలక్ష్మి

ప్రజాశక్తి
www.prajasakti.com

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 7వతేదీ నుంచి ప్రారంభించనున్న పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వమే మిర్చి డబ్బి రకం, కడ్డీ రకానికి క్వింటాకు రూ.50వేలు, ఇతర రకాల మిరపకు రూ.25 వేలతో కొనుగోలు చేయాలని, 2024-25 నష్టపోయిన పంటలకు పంట నష్టపరిహారం, బీమా ప్రకటించాలని, నష్టపోయిన మిర్చి రైతులకు ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని, పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ.10వేలతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల సాధనకు ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న పాదయాత్రను ప్రారంభించి 10వతేదీన అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పాదయాత్ర, ధర్నాలో రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్, నాయకులు రఘు, విక్రమ్, శీనా, ఒంటిమిద్ది గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 7వతేదీ నుంచి ప్రారంభం కానున్న పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు మాట్లాడుతూ మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, పప్పుశనగ, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, సీడ్స్, జొన్న, రైతులకు గిట్టుబాటు ధర కల్పించి దళారుల నుంచి రైతులను ప్రభుత్వం కాపాడాలని, తదితర డిమాండ్ల సాధనకు పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. పాదయాత్రలో రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి ఎం.పోతులయ్య, సుబ్బిరెడ్డి, ఎస్.పోతలయ్య, హరీష్, రామిరెడ్డి, పెదయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న చేపట్టనున్న పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన మిరప, పత్తి, పప్పు సెనగ, సీడ్ జొన్నల పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7వ తేదీ నుంచి 10 తేదీ వరకు ఉరవకొండ నుంకూ జిల్లా కలెక్టర్ ఆఫీస్ వరకు రైతు పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మరాజు, మధు, రమేష్, శంకర్, ఆంజనేయులు, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : ఈనెల 7వ తేదీ నుంచి 10వతేదీ వరకూ ఉరవకొండ నుంచి కలెక్టరేట్ వరకూ చేపట్టనున్న రైతు పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలోని హమాలీ యూనియన్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు, సిఐటియు మండల కార్యదర్శి బికె భీమన్న, రైతుసంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, నాయకులు వెంకటేశులు, తిమ్మప్ప, మారెన్న, పాతన్న, నరసింహులు, మల్లి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న రైతుసంఘం, సిఐటియు నాయకులు

హమాలీల కూలిరేట్ల పెంపుపై హర్షం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సివిల్ సప్లరు హమాలీలకు కూలి రేట్లు పెంపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 14 జిఒపై సివిల్ సప్లరు హమాలీ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ ధ్యక్షులు ఆర్వి.నాయుడు, కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సివిల్ సప్లరు హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆర్వి.నాయుడు మాట్లాడుతూ పౌరసరఫరాల సంస్థలో జిల్లా వ్యాప్తంగా మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో పని చేస్తున్న 400 మంది హమాలీ లకు పెంచిన కూలి రేట్లు గత ఒప్పందం కంటే ప్రస్తుత ఒప్పందం మెరుగైందన్నారు. సిఐటియు అనుబంధ సంఘం ఆందోళన, పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. దీంతో హమాలీల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.నారాయణస్వామి, సుభాన్, మేస్త్రీలు సి.నారాయణస్వామి, ముని, శంకర్ హమాలీలు పాల్గొన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు, హమాలీలు

ఐలూ రాష్ట్ర కమిటీలో జిల్లా న్యాయ విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన న్యాయ విద్యార్థులకు చోటు దక్కింది. ఆదివారం ఐలు ఆధ్వర్యంలో విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో న్యాయ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై న్యాయ విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందించారు. న్యాయవిద్యార్థులు ప్రతి అంశాన్ని అధ్యయనం చేసి అవగాహన కలిగించుకుని సామాజిక ఇంజనీర్లుగా తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలని సూచించారు. అనంతరం నిర్వహించిన ఐలు న్యాయ విద్యార్థుల కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఐలు రాష్ట్ర నూతన కమిటీ ఏర్పాటులో అనంతపురం విద్యార్థులకు చోటు లభించింది. ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎం.బాను, యశ్వంత్ నాయుడు, నాగభూషణ, గిరీష్‌కు చోటు కల్పించారు. ఈ సందర్భంగా ఐలు అనంతపురం జిల్లా కార్యదర్శి సతీష్ వారికి అభినందించారు.



ఐలూ రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకున్న జిల్లా న్యాయ విద్యార్థులు

మసీదుల్లో సౌకర్యాలు కల్పించండి

మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశం

ప్రజాశక్తి-అనంతపురం

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని మసీదుల్లో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ముందుగా రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు అత్యంత నియమనిష్టలతో ఉపవాస దీక్షలు ఆచరించనున్న ప్రతిఒక్కరికీ అల్లా దయతో మంచి జరగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ పరిధిలోని మసీదుల్లో ఉపవాస దీక్ష విరమణ, ప్రార్థనల సమయాల్లో విద్యుత్, వాటర్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఇప్పటికే గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలోని 4 పంచాయతీల్లో ఉన్న మసీదుల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ, పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు.

ప్రజా సమస్యలపై అవగాహన అవసరం

జనసేన నాయకులు శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ప్రజా సమస్యలపై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్నారు. అప్పుడే పార్టీకి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పార్టీ చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా మండల కేంద్రంలో త్వరలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల అనునిత్యం ప్రజల్లోనే ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ భయపరెడ్డి, యువ నాయకులు పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నాయకులు శ్రీకాంత్‌రెడ్డి

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-గుత్తి

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని టిడిపి గుత్తి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని గుత్తి – అనంతపురం రోడ్డులో ఉన్న మదరసా ఎ దారుల్ ఉలూం ఫైజుల్ ఇస్లాం లో విఫాఖుల్ ఉలామా ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 150 మంది పేద ముస్లింలకు రూ.2,500 విలువజేసే బియ్యం, బేడలు, గోధుమపిండి, వంట నూనె, పంచదార, కొబ్బరితో కూడిన 15 వస్తువుల కిట్లను ముఖ్య అతిథి టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి, మదరసా అధ్యక్షులు షేక్ మౌలానా అబ్దుల్ హక్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంకె.చౌదరి మాట్లాడుతూ సేవతో ఆత్మ సంతృప్తి లభిస్తుందన్నారు. పేద ముస్లిములకు ఉచితంగా నిత్యావసర వస్తువులను విఫాఖుల్ ఉలామా ఆధ్వర్యంలో పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మదరసా ఎ దారుల్ ఉలూమ్ ఫైజుల్ ఇస్లాం అధ్యక్షులు షేక్ మౌలానా అబ్దుల్ హక్, టిడిపి నాయకులు చెరుకూరి అబ్బాస్, హెచ్‌ఎం రసూల్, దాక్షిణామూర్తి రైటర్ రామకృష్ణ, విశ్రాంత జెఇఒ షేక్షావలి, ఖాజామొయిద్దీన్, ఫజులుల్లా, ఖలీద్, బాషా, సాయి హేమచంద్రిక, తదితరులు పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

అనారోగ్యం బారిన పడి ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న బాధితులకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం నగరంలోని టిడిపి అర్బన్ పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. లక్ష్మీనగర్‌కు చెందిన హనుమక్కకు రూ.36వేలు, 4వరోడ్డుకు చెందిన రఫీద్దీన్‌కు రూ.2.17లక్షల చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆయా బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, టిడిపి నగర ఉపాధ్యక్షుడు గోళ్ల సుధాకర్‌నాయుడు, బెస్ట్ సాధికార కమిటీ రాష్ట్ర నాయకుడు చేపల హరి, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుదీన్ తదితరులు పాల్గొన్నారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ఘనంగా వీరాంజనేయస్వామి రథోత్సవం

హెలికాప్టర్‌తో పూలవర్షం కురిపించిన గ్రామస్తులు

ప్రజాశక్తి-కుందుర్పి

మండల పరిధిలోని వడ్డెపాలెం గ్రామంలో ఆదివారం వీరాంజనేయ స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహిస్తున్న సమయంలో హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపించారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉత్సవంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుడు ధర్మతేజ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ నగేష్ గట్టి బందోబస్తు చేపట్టారు. ఉత్సవంలో సర్పంచు గోవిందమ్మ ఓబన్న, తహశీల్దార్ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



రథంలో కొలువుదీరిన స్వామివారు

చంద్రబాబు వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

ప్రజాశక్తి-అనంతపురం

'వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి డైరెక్ట్‌గా కానీ, ఇన్ డైరెక్ట్‌గా కానీ పనులు చేసే పరిస్థితి ఏ స్థాయిలో కూడా రాకూడదు.. అలా చేస్తే 'పాముకు పాలు పోసినట్టే'.. అంటూ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పుడు అందరినీ సమానంగా చూడాలేగానీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. చంద్రబాబు కేవలం టిడిపి, జనసేన, బిజెపి వారికి మాత్రమే ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారా..? అని మండిపడ్డారు. గతంలో జగన్ సీఎంగా ఉన్నప్పుడు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. చివరకు తమ పార్టీకి ఓటు వేయని వారికి కూడా పథకాలు అందించాలని అప్పట్లో జగన్ చెప్పారని గుర్తు చేశారు. పార్టీల వారీగా విభజించి జగన్ ఏనాడూ పాలన చేయలేదన్నారు. చంద్రబాబు ఇలా వ్యాఖ్యలు చేయడం మొదటిసారి కాదని.. గతంలో కూడా 'మేం వేసిన రోడ్ల మీద మీరు తిరుగుతున్నారు. మీరు నాకు ఓటు వేయకపోతే నేనెందుకు మీకు పనిచేయాలి' అని సాక్షాత్తూ ముఖమంత్రి హోదాలోనే చంద్రబాబు చెప్పారన్నారు. చంద్రబాబు, లోకేష్‌లో రాజ్యాంగేతర శక్తులుగా మారుతున్నారన్నారు. కక్షపూరిత రాజకీయాలు చేస్తూ ప్రతిపక్ష నాయకులపై కేసులు పెడుతున్నారన్నారు. రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో బాలకృష్ణ ఇంట్లో ఓ ఘటన జరిగితే దాన్ని మేం రాజకీయం చేయలేదన్నారు. మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆయన చేసిన ప్రమాణానికి విరుద్ధంగా వ్యవహార శైలి ఉందని, చంద్రబాబు తన స్థాయిని దిగజార్చుకున్నారని మండిపడ్డారు. జగన్ పాలనను చూసి చంద్రబాబు నేర్చుకోవాలన్నారు. అంత:కరణ శుద్ధితో పనిచేయాలని భారత రాజ్యాంగం చెబుతోందన్నారు. సీఎం, మంత్రులు రాగద్వేషాలకు అతీతంగా పని చేయాలని సూచించారు. అంతేగాకుండా జగన్, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్య పదజాలంతో టీడీపీ కూటమి నేతలు పోస్టింగులు పెడుతున్నారన్నారు. అయినప్పటికీ ఎక్కడా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇలాగే కొనసాగితే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.




మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి, శైలజానాథ్

ముగిసిన వైద్యుల జాతీయ సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అనంతపురం సైకియాట్రిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి మానసిక వైద్యుల నిరంతర వైద్య విద్య సదస్సు ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ న్యాయవాది పరిటాల శైలజ మాట్లాడుతూ మానసిక రుగ్మతలను గ్రామీణ స్థాయి నుంచి గుర్తించి తగిన వైద్యం అందించే దిశలో వైద్యరంగం అభివృద్ధి చెందాల్సి ఉందని అన్నారు. మానసిక వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ సవిత మల్హోత్రా మాట్లాడుతూ వైద్యశాస్త్రం ఎంతో పురోగతి చెందిందన్నారు. ఇందులో మానసిక వైద్యశాస్త్రం మరింత అభివృద్ధి వైపుగా అడుగులు వేస్తోందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో మానసిక వైద్యం మరింత అభివద్ధి పడేలా కృషి జరగాల్సి ఉందన్నారు. ఆ దిశలో మానసిక వైద్యులు సైతం కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మానసిక వైద్యులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్రంతోపాటు దేశం నలుమూలల నుంచి 380 మందికి పైగా మానసిక వైద్యులు హాజరవడం విశేషం అన్నారు. రెండవ రోజు మానసిక వైద్యంలో వచ్చిన అత్యాధునిక వైద్య చికిత్సలు, ఆధునిక వైద్య విద్యలు, మానసిక శాస్త్రంలో పరిశోధనలు గురించి దేశంలోనే ప్రముఖ సైకియాట్రిస్టులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అత్యంత సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైకియాట్రిస్టులు టి.పి సుధాకర్, ఎన్‌వి రమణారావు, జగదీష్, రఘురాం, వికాస్‌మీనన్, రాజశేఖర్, చంద్రశేఖర్, జివిఎస్ మూర్తి, లోకేశ్వర్‌రెడ్డి, శరత్‌చంద్ర, రాధికారెడ్డి, అనంతపురం సైకియాట్రిస్టులు శ్రీకాంత్‌గుప్తా, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.



ముగింపు సదస్సులో పాల్గొన్న వైద్యులు

స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు

యాడికి : స్టార్ ప్యారడైజ్ హైస్కూల్‌లో ఆదివారం వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ నాగేంద్ర, ఇలాహీ, రంగస్వామి, కరస్పాండెంట్ ఎంజె లారెన్స్‌బాబు, డాక్టర్ అయేషా అలీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్, జూటూరు అబ్దుల్‌రజాక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

గ్రామ పంచాయతీలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచు మల్లెల వనిత అన్నారు. నీటి ఎద్దడి నివారణలో భాగంగా శనివారం అర్ధరాత్రి నుండి గ్రామపుర వీధుల గుండా పైప్‌లైన్ తీయించి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు నీటిని సరఫరా చేశారు. అనంతరం కొండాపురం గ్రామ సచివాలయంలో సర్పంచు మాట్లాడుతూ పంచాయతీలోని కోనాపురం, కొండాపురం, సుగేపల్లి గ్రామాల్లో వేసవి ఎద్దడి తలెత్తుకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే పైప్‌లైన్ పనులు చేపట్టి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మఠం మల్లికార్జున, మఠం విరుపాక్షి, డీలర్ శీనప్ప, జెసిబి శీనా, ఉపసర్పంచు శాంతి, మాజీ ఉపసర్పంచు తమన్న, రవి, కురుగౌడ, ఆలేష్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

యాడికి : తనతోపాటు కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రుడు అకాల మరణంతో అతని కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన జయరాముడు ఇటీవల క్యాన్సర్‌తో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 2002-03లో పదో తరగతి చదువుకున్న బాల్యమిత్రులు సేకరించిన రూ.50వేలను మృతుడి భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్యమిత్రుల బృందం సభ్యులు బాబావలి, రాజేంద్ర, రమేష్, గురునాథ్, నారాయణస్వామి, రఘు, ప్రసాద్, సుదర్శన్, ఓబులేసు, సూర్యనారాయణ, కృష్ణమూర్తి, మాబు, సుభాని, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు 'ఉపాధి'ని అనుసంధానించాలి

శింగనమల : ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని జూలాకాలువ, పి.జలాలపురం ఏర్పాటు చేసిన నూతన కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులు రైతులకు ఉపయోగం పడేలా చేస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా కూలీల కలుపులు, సేద్యం, పంట నూర్పిడి, తదితర ఖర్చులు కలిసి వస్తే రైతులకు కాస్త ఉపశమనం కలుగుతుందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి ఉపాధి పనులను వ్యవసాయ పనులకు అనుసంధానించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షులు మధుయాదవ్, చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి చేనేత మధు, నాయకులు వెంకటరెడ్డి, శివయ్య, రామకృష్ణ, నాగన్న, రాజప్ప, లక్ష్మీనారాయణ, నారప్ప, శంకర, వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

15న రాతిదూలం పోటీలు

యాడికి : మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జెసి ఫ్యామిలీ, భక్తుల ఆధ్వర్యంలో ఈనెల 15న రాతిదూలం పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు, క్లాస్‌వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి మొదటి బహుమతి రూ.లక్షను, బియ్యం బాలు రెండో బహుమతి రూ.80వేలు, రాచమల్లు నాగలింగేశ్వరరెడ్డి మూడో బహుమతి రూ.60 వేలు, ఉమ్మడి పాల ప్రభాకర్‌రెడ్డి 4వ బహుమతి రూ.40 వేలు, చందగాని ధ్రువ నారాయణ, స్టాంపుల సూరి 5వ బహుమతి రూ.20వేలు, పుట్లూరు సత్యనారాయణరెడ్డి 6వ బహుమతి రూ.10వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగర సమీపంలో ఉన్న శిల్పారామంలో ఆదివానం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా అనంతపురానికి చెందిన తన్మయి, సహస్ర, చంద్రలేఖ, పరిణీత సాయి బృందం చేసిన భరతనాట్యం అలరించింది. ఈ సందర్భంగా శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ శిల్పారామం అభివృద్ధిలో భాగంగా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అనంతపురం ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు కృషి చేస్తున్నామన్నారు.



నాట్యం చేస్తున్న చిన్నారులు

వైసిపి నేత పుల్లయ్య మృతికి నివాళి

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌కు చెందిన వైసిపి సీనియర్ నాయకులు బిందె పుల్లయ్య (80) శనివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, వైసిపి యువనేత సిబి.మంజునాథ్‌రెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు కె.మధుసూదన్‌రెడ్డి, జి.గంగరాజు యాదవ్, నాయకులు బళ్లారి రాజకుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ యాదవ్, తదితరులు పుల్లయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వి.వరదరాజులు, ఫారూఖ్, నాయకులు ఎం.రంగస్వామి, హరినాథ్‌రెడ్డి, డి.షఫీ, ఎల్ఐసి హరినాథ్‌రెడ్డి, డి.సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



పుల్లయ్యకు నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

ముస్లిములకు ఇఫ్తార్ విందు

గుత్తి : పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న నూరాణి మసీదులో ఆదివారం రాత్రి ఎంపి సోదరుల ఆధ్వర్యంలో ముస్లిములకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింల పవిత్ర మాసం రంజాన్ నెల ప్రారంభం సందర్భంగా విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి, నాయకులు జక్కలచెరువు ప్రతాప్, చికెన్ శీనా, హెచ్‌ఎం. రసూల్‌ను ముస్లిములు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇసాక్‌సాబ్, మైనుద్దీన్, నిజాముద్దీన్, ఎం.రామకృష్ణ, డీలర్ సూరి, రవి, రామాంజి, సురేష్ గౌడ్, గుల్బర్గా, బాల, తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందు ఇస్తున్న నాయకులు

విద్యార్థి వైద్యం కోసం ఆర్థికసాయం

కళ్యాణదుర్గం రూరల్ : విద్యార్థి వైద్యం కోసం ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. కళ్యాణదుర్గం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మల్లికార్జున, మౌనిక మొదటి కుమారుడు సాయిధరమ్ తేజ్ 4వ తరగతి చదువుతున్నాడు. అయితే సాయిధరమ్ ఆడుకుంటూ చెట్టు పైనుంచి కిందకు పడటంతో ప్రయివేట్ భాగాలూ చిట్లిపోయి ఆపస్మారక స్థితిలో వెళ్లిపోయాడు. ఈసమయంలో వైద్యం కోసం ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న బద్దేనాయక్ అనంతపురంలోని సవీరా ఆసుపత్రిలో విద్యార్థికి ఆపరేషన్ చేయించి ప్రాణాపాయం నుంచి కాపాడాడు. అంతేగాకుండా చికిత్స కోసం విద్యార్థి తండ్రి మల్లికార్జున తన ఆటోను తాకట్టు పెట్టిన విషయం తెలుసుకుని డబ్బులు చెల్లించి ఆటోను విడిపించాడు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు బద్దేనాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్థికసాయం అందజేసిన బద్దేనాయక్

కనకదాసు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు మండలంలోని తిమ్మాపురం గ్రామంలో కనకదాసు విగ్రహ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కోటప్ప, చిరంజీవి, మచ్చప్పగారి గంగాధర్, వార్డు మెంబర్ అనిల్, మాజీ డీలర్ మహేష్, క్రిష్ణప్రసాద్, శ్రీనివాసులు, సుధాకర్, సారే మల్లన్న, మంగపోటీ మహేష్, అనిల్, నాగరాజు, బోడి మళ్లూరప్ప, పూజారి మాళ్లూరప్ప, శంకర్, సంజీవ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నీటిగుంతలో పడి బాలుడి మృతి

తాడిపత్రి రూరల్ : నీటిగుంతలో పడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన రూరల్ పరిధిలోని చుక్కలూరు రోడ్డులో పారిశ్రామికవాడలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. చుక్కలూరు రోడ్డులో ఉన్న మారుతి నల్లబండల ఫ్యాక్టరీలో నివాసం ఉంటే దంపతులు పామిడిలోని కొడుకు గంగరాజు, కోడలిని శివరాత్రి సందర్భంగా ఇంటికి పిలుచుకొచ్చారు. ఈనేపథ్యంలో గంగరాజు కుమారుడు గౌతమ్‌నంద (3) ఆడుకుంటూ ప్రమాదవశాత్తు అక్కడున్న పాలీష్ నీటిగుంతలో పడి మునిగిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుంతలో పడిన బాలుడిని బయటకు తీసి చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు రూరల్ తెలిపారు.



మృతిచెందిన గౌతమ్‌నంద

గంగాదేవిపల్లిలో చోరీ

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని గంగాదేవిపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఓబులమ్మకు చెందిన ఇంట్లో అదే గ్రామానికి చెందిన రాజు చోరీకి పాల్పడ్డాడు. రాజు చోరీకి పాల్పడుతుండగా పట్టుకున్న గ్రామస్తులు నిందితుడిని తాడిపత్రి రూరల్ పోలీసులకు అప్పగించారు. ఓబులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

గేట్‌మెన్‌పై దాడి

రాయదుర్గం : పట్టణంలోని లెవెల్ క్రాసింగ్ 35 వద్ద డ్యూటీలో ఉన్న గేట్ మెన్ కుమార్‌నాయక్‌పై ఆదివారం ఓ వ్యక్తి దాడి చేశాడు. లెవెల్ క్రాసింగ్ వద్ద డ్యూటీలో ఉండగా ఒక వ్యక్తి దూషించి, రాయితో కొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో గేట్‌మెన్ తలకు గాయమైంది. ఘటనపై గుంతకల్లు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

పెద్దవడుగూరు : మండలంలోని మిడుతూరు జాతీయ రహదారిలో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం జప్తు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. నంద్యాల జిల్లా డోన్ మండలం ధర్మవరం ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. పట్టుబడిన టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.